సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 8 । ఆగస్టు । 2023



సంతృప్తికర పరిష్కారం చూపాలి

'జగనన్నకు చెబుదాం'లో ప్రతి సమస్యకు సంతృప్తికర పరిష్కారం చూపాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు.

- 8లో



లైంగిక వేధింపుల కేసు

బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు అందిన ఫిర్యాదు మేరకు వంగర జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిపై కేసు నమోదైంది.

- 8లో

11న ఆహార కమిషన్ సభ్యులు రాక

పార్వతీపురం: రాష్ట్ర ఆహారకమిషన్ సభ్యులు ఇ.లక్ష్మీరెడ్డి, జి.దేవి ఈ నెల 11న పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటిస్తారని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటుచేస్తారన్నారు. అధికారులు సమగ్ర సమాచారంతో సమీక్ష సమావేశానికి హాజరుకావాలని ఆదేశించారు.

న్యూస్‌రీల్

స్టాఫ్‌నర్సు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఎస్‌ఎన్‌సీయూ, యూపీహెచ్‌సీ, డీఈఐసీలలో ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్సు, డీఈఓ, లాస్ట్ గ్రేడ్ సర్వీసెస్, సపోర్టింగ్ స్టాఫ్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. విద్యార్హత, ఇతర వివరాలకు విజయనగరం.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

23.9 కేజీల గంజాయి స్వాధీనం



పట్టుకున్న గంజాయి, ముద్దాయితో పోలీసులు

సాలూరు: మండలంలోని నేరెళ్లవలస సమీపంలో ఇద్దరు వ్యక్తుల నుంచి 23.9 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మండలంలోని నేరెళ్లవలస సమీపంలో దాడి చేసి సాలూరుకు చెందిన ప్రధాన్, పొట్టంగి బ్లాక్‌కు చెందిన సుబ్బారావుసతిలను గంజాయితో పట్టుకుని అరెస్టు చేశామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

రంగంవలసలో ఏనుగుల సంచారం

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో కొండ శిఖరంపై ఉన్న రంగంవలస పరిసర ప్రాంతాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. గ్రామానికి చెందిన సవర బుద్ధుడుకు చెందిన కొర్ర పంటను ధ్వంసం చేశాయి. వ్యవసాయ పనుల కోసం సవర గొండు అనే గిరిజనుడు వేసుకున్న పాకను విసిరేశాయి. నాలుగు ఏనుగుల గుంపు రెండు మూడు రోజులుగా ఇక్కడే సంచరిస్తున్నాయని, అటవీ శాఖ అధికారులు స్పందించి ఏనుగులు అటవీ ప్రాంతంలోకి మళ్లించే చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి ఏర్పాట్లు



ఆదివాసీతల్లి విగ్రహానికి రంగులు అద్దుతున్న పెయింటర్

సీతంపేట: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈ నెల 9న ఘనంగా నిర్వహించేందుకు ఐటీడీఏ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సీతంపేట ఐటీడీఏ ఆవరణలో ఉన్న అడవితల్లి విగ్రహానికి రంగులు వేయడంతో పాటు గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం ఆవరణలో స్టేజ్ ఏర్పాటు చేస్తున్నారు. ఐటీడీఏ పరిసరాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఉదయం 9గంటల నుంచే వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆదివాసీ దినోత్సవానికి హాజరయ్యే గిరిజనులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లుచేస్తున్నారు.

9 నుంచి 'నా భూమి.. నా దేశం'

పార్వతీపురం: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఈ నెల 9న నా భూమి- నా దేశం, నేల తల్లికి నమస్కారం కార్యక్రమాలను పట్టణ, పంచాయతీల్లో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను సోమవారం ఆదేశించారు. 10న పంచప్రాణ ప్రతిష్ట, ప్రతిజ్ఞ, సెల్ఫీ, 11న వసుధ వందన్ కార్యక్రమం కింద గ్రామస్థాయిలో కనీసం 75 మొక్కలు నాటాలని సూచించారు. దేశభక్తి పెంపొందించేలా 14న వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించాలన్నారు.

ఆరోగ్యమిత్రకు సేవామిత్ర పురస్కారం



రాజశేఖర్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా పథకాలను అర్హులకు చేరువ చేయడంలో ఉత్తమ ప్రతిభ చూపిన సీతంపేట ఏరియా ఆస్పత్రి ఆరోగ్యమిత్ర కుండంగి రాజశేఖర్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆరోగ్యమిత్ర పురస్కారాన్ని కలెక్టర్ నిషాంత్‌కుమార్ సోమవారం అందజేశారు. కలెక్టర్ కార్యాలయంలో ఆరోగ్యమిత్ర పురస్కారంతోపాటు రూ.5వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్వో జె.వెంకటరావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.బి.జగన్నాథరావు పాల్గొన్నారు.

'గడపగడప'లో.. ప్రగతి పథం

- సమస్య పరిష్కారంలో నాడు నిర్లక్ష్యం.. నేడు సౌకర్యం
- 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంతో గుదిబండ సమస్యల పరిష్కారం
- దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న ఇబ్బందుల నుంచి ప్రజలకు ఊరట
- క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేలు, అధికారుల పర్యటనలతో సమస్యల గుర్తింపు
- ప్రతి గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో రూ.20 లక్షల చొప్పున నిధులు
- పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.55.36 కోట్లతో 2,190 పనుల మంజూరు
- రూ.53.85 కోట్ల విలువైన 2,163 పనులు పురోగతి
- ఇప్పటివరకూ రూ.5 కోట్ల విలువైన 226 పనుల పూర్తి

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

పార్వతీపురం మన్యం జిల్లాలో దీర్ఘకాలంగా ప్రజలకు గుదిబండగా ఉన్న సమస్యలన్నింటికి 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం చక్కని పరిష్కారం చూపుతోంది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గత ఏడాది మే 11వ తేదీన ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రజలకు వరప్రదాయినిగా మారింది. ప్రతీ గడపలో సంక్షేమాన్ని నింపడంతో పాటు అభివృద్ధికి ఆస్కారం కల్పిస్తోంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ సంబంధిత ఎమ్మెల్యే, అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలో వెలుగులోకి వచ్చిన సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ/వార్డు సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున అదనపు నిధులను మంజూరు చేస్తోంది. ఇవి చాలకపోతే ఎమ్మెల్యే కోటాలో నిధులను కేటాయిస్తున్నారు. అంతకన్నా మించిపోతే కలెక్టర్ కోటాలో నిధుల కోసం ప్రతిపాదనలు పంపుతున్నారు. ప్రధానంగా క్షేత్రస్థాయిలో రోడ్లు, డ్రైయినేజీలు, తాగునీరు, రక్షణగోడలు, శానిటేషన్, సీసీ రోడ్లు, లింక్ రోడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నారు.



నాడు

ఈ చిత్రం చూశారా? ఇది సీతానగరం మండలంలో బందలుప్పి-పులిగొమ్మి కూడలి నుంచి రేపటివలస గ్రామం వరకూ ఉన్న కాలిబాట. సరైన రోడ్డు లేదని ఈ గ్రామస్తులతో వివాహ సంబంధాలకూ ఇతర గ్రామాల వారు విముఖత చూపించేవారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు వేయిస్తానని బొబ్బిలి నియోజకవర్గ నాయకుడు బేబీనాయన ఆశ చూపిస్తే కొందరు రైతులు తమ భూమిని సైతం ఆయనకు విక్రయించేశారు. ఇలా 280 ఎకరాలు బేబీనాయనకు, ఆయన కుటుంబానికి ఆస్తి వచ్చిందేమో గానీ ప్రజలకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు మాత్రం నిర్మించలేదు.



నేడు

ఇది రేపటివలస రోడ్డే! వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సాకారమైంది. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆ గ్రామానికి వెళ్లినప్పుడు ప్రజలు తమ సమస్యపై శాంతియుతంగా నిరసన తెలిపారు. రోడ్డు వేసి అప్పుడు తమ గ్రామంలో ఓటు అడగాలని సవాలు విసిరారు. దీంతో రూ.1.40 కోట్ల వ్యయంతో రెండు కిలో మీటర్ల పొడవున తారురోడ్డు వేయించారు.



నాడు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బలిజిపేట మండలంలో నాలుగైదు గ్రామాల రైతులకు చెందిన 20 వేల ఎకరాల ఆయకట్టుకు తోటపల్లి బ్రాంచ్ కెనాల్ నుంచి సాగునీరు అందని పరిస్థితి. పూడుకుపోయిన పిల్ల కాలువ ద్వారా నీరు రాక పంటలు ఎండిపోతుండేవి.



నేడు

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రైతులు పార్వతీపురం ఎమ్మెల్యే జోగారావు దృష్టికి తమ సాగునీటి కష్టాలు తీసుకెళ్లారు. ఆయన హామీ మేరకు బొబ్బిలి నియోజకవర్గంలోని పిరిడి వరకూ మాత్రమే ఉన్న బ్రాంచ్ కెనాల్ నుంచి పక్కి మీదుగా బలిజిపేట మండంలోని పెదపెంకి గ్రామం వరకూ డిస్ట్రిబ్యూటర్ కెనాల్ రూ.50 కోట్లు వ్యయంతో నిర్మాణం పూర్తి అయ్యింది. సకాలంలో పనులు పూర్తికావడంతో ఇప్పుడు పొలాలకు సాగునీరు అందిస్తున్న కాలువ చిత్రం ఇది.

మా ఊరి ప్రజల కష్టాలు తీరాయి....



కొన్నేళ్లుగా మా ఊరి నుంచి రేపటివలస వరకూ సరైన దారి లేక నానా అవస్థలూ పడుతూ వచ్చాం. గత టీడీపీ ప్రభుత్వంలో ఎన్నోసార్లు మొత్తుకున్నా రోడ్డు వేయలేదు. ఈ రోడ్డు కోసమే కొంతమంది తమ భూమి సైతం అమ్మేసినా ఫలితం లేకపోయింది. పొలాల నుంచి పంట ఇంటికి తెచ్చుకోవాలంటే నెలల కాలం పట్టేది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి మా ఊరు వచ్చిన ఎమ్మెల్యే జోగారావు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లాం. ఆయన మా కష్టాలు చూసి రోడ్డు మంజూరు చేయించారు. మా ఊరి కష్టాలు జగనన్న ప్రభుత్వంతో తీరాయి.

– గౌరీశ్వరి, ఎంపీటీసీ సభ్యులు, తామరఖండి

జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో జూలై నెలాఖరు నాటికి మొత్తం 2,190 పనులు మంజూరయ్యాయి. వీటి అంచనా విలువ రూ.55.36 కోట్లు. వీటిలో రూ.53.85 కోట్ల విలువైన 2,163 పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే రూ.6.78 కోట్లతో 262 పనులు పూర్తయ్యాయి. 226 పనులకు సంబంధించిన రూ.5.01 కోట్ల మేర బిల్లుల చెల్లింపు కూడా పూర్తి అయ్యింది.

రహదారి సమస్య తీరింది...





ఇది గరుగుబిల్లి మండలం ఉద్దవోలు గ్రామంలో రూ.11 లక్షలు వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి దృష్టికి మా ఊరి రోడ్డు సమస్యను తీసుకెళ్లాం. ఆ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. సత్యసాయి గుడి నుంచి బీటీ రహదారి వరకు సీసీ రోడ్డు నిర్మాణమైంది' అని ఉద్దవోలు గ్రామస్తుడు బాణాల సురేష్ కుమార్ చెప్పారు.

మురుగు సమస్యకు చెక్...

భామిని మండలం గురండి గ్రామంలోని దళితవాడలో మురుగు కాలువలు నిర్మిస్తున్న చిత్రం ఇది. 'మా దళితవాడలో వీధి కాలువలు లేక దశాబ్దాలుగా అవస్థలు పడుతున్నాం. జగనన్న ప్రభుత్వం నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం లభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మా ఇళ్లవద్దకు వచ్చినప్పుడు విన్నవించాం. రూ. 5 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో కాలువల నిర్మాణ పనులు జరుగుతున్నాయి' అని ఆ గ్రామస్తుడు బిడ్డిక రాంబాబు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





వైఎస్సార్‌సీపీ గ్రామమని పట్టించుకోలేదు...



ఇది కొమరాడ మండలం మాదలింగి పంచాయతీ పరిధి చీడిపల్లి గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు చిత్రం. 'మా గ్రామమంతా వై.ఎస్.రాజశేఖరరెడ్డి, వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులే. వైఎస్సార్‌సీపీ గట్టి పట్టు ఉన్న గ్రామం. అందుకే టీడీపీ నాయకులకు కన్నెర్ర. గ్రామంలో రోడ్డులేక దశాబ్దాలుగా రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని, చిన్నపిల్లలు పాఠశాలకు బురదలో వెళ్లలేకపోతున్నారని విన్నవించుకున్నా గత టీడీపీ ప్రభుత్వంలో పాలకులు పట్టించుకోలేదు. ఇన్నాళ్లకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇక్కడకు వచ్చిన మా కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి సీసీ రోడ్డు మంజూరు చేశారు. నిర్మాణం పూర్తికావడంతో మా కష్టాలు తీరాయి' అని గ్రామస్తుడు రాగాల సంతోష్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశారు.

నిధులు, పనుల ప్రగతి ఇలా...

నియోజకవర్గం	మంజూరైన పనులు	పురోగతిలోనున్న పనులు	పూర్తి అయిన పనులు
పాలకొండ	541 (రూ.12.18 కోట్లు)	538 (రూ.12.12 కోట్లు)	35 (రూ.74 లక్షలు)
కురుపాం	688 (రూ.15.81 కోట్లు)	688 (రూ.15.81 కోట్లు)	85 (రూ.1.68 కోట్లు)
పార్వతీపురం	401 (రూ.14.03 కోట్లు)	381 (రూ.12.98 కోట్లు)	73 (2.84 కోట్లు)
సాలూరు	560 (రూ.13.34 కోట్లు)	556 (రూ.12.94 కోట్లు)	69 (రూ.1.52 కోట్లు)

చెప్పిన వెంటనే పరిష్కారం...



మాగ్రామంలో రామాలయం వీధి నుంచి బొబ్బిలి-మక్కువ రోడ్డు వరకూ ఉన్న వీధిమార్గం అధ్వానంగా ఉండేది. చిన్న వర్షం పడినా బురద అయ్యేది. పిల్లలు, వృద్ధులు నడవడానికి చాలా ఇబ్బంది పడేవారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లాం. చెప్పిన వెంటనే రూ.6 లక్షలు మంజూరు చేశారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి అయ్యింది.

–దొడ్డి హైమావతి, ఎ.వెంకంపేట గ్రామం, మక్కువ మండలం

ఏళ్లనాటి తాగునీటి సమస్యకు మోక్షం...



'మా గ్రామంలో తాగునీటి సమస్య ఎప్పటి నుంచో ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఐటీడీఏ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు వినతులు ఇచ్చినా ఫలితం లేకపోయింది. పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, అధికారులు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మా ఊరికి వచ్చినపుడు గ్రామస్తులంతా తాగునీటి సమస్యపై విన్నవించారు. వెంటనే చిన్నతరహా రక్షిత మంచినీటి పథకం మంజూరు చేశారు. బోరు తవ్వకం పూర్తి అయ్యింది. ట్యాంకు నిర్మాణ పనులు పూర్తి అయితే మాకు తాగునీటికి ఢోకా ఉండదు' అని సీతంపేట మండలం అంటికొండ పెద్దగూడ సర్పంచ్ బాపయ్య చెబుతున్నారు.

వేగవంతంగా పేదల ఇళ్ల నిర్మాణాలు

పార్వతీపురం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి మండల స్థాయి అధికారులతో పనుల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్‌లో సోమవారం సమీక్షించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 21 తరువాత రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల గృహప్రవేశాలు చేపట్టనున్నారన్నారు. ఇందులో భాగంగా మక్కువ గృహ నిర్మాణాల కాలనీలో జిల్లా స్థాయి గృహప్రవేశాల కార్యక్రమాన్ని చేపడతామని చెప్పారు. కాలనీలో మంచినీటి సౌకర్యం, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కాలనీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, హౌసింగ్ పీడీ టి.రమేష్, జిల్లా విద్యాశాఖ సహాయ సంచాలకులు ఎం.రామజ్యోతి, డుమా పీడీ కె.రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, పీఆర్ ఎస్ఈ ఎంవీజీ కృష్ణాజీ, డీఎంఅండ్‌హెచ్‌ఓ బి.జగన్నాథరావు, డీపీఓ బి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డీవార్మింగ్ డే వాల్‌పోస్టర్ ఆవిష్కరణ




గోడపత్రికను ఆవిష్కరించిన కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: నులిపురుగుల నివారణ మాత్రలను 1-19 ఏళ్ల వయస్సు ఉన్న వారందరికీ అందజేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. ఈనెల 10న నిర్వహించే డీ వార్మింగ్ డే రెండో విడత కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1-2 ఏళ్ల వయస్సుగల పిల్లలు 19,106 మందికి సగం మాత్ర, 2-19 ఏళ్ల వయస్సు ఉన్న 1,71,332 మందికి ఒక మాత్ర చొప్పున పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీల ద్వారా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్వో వెంకటరావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ బి.జగన్నాథరావు పాల్గొన్నారు.

బుచ్చి అప్పారావు విగ్రహానికి స్థలం కేటాయింపు

- ఈస్ట్‌కోస్ట్ చీఫ్ ఇంజినీర్ సుగుణాకర్



తాటిపూడి జలాశయం వద్ద స్థల పరిశీలన చేస్తున్న చీఫ్ ఇంజినీర్, సంఘం కొప్పలవెలమ సంఘం నాయకులు

గంట్యాడ: గొర్రిపాటి బుచ్చి అప్పారావు జలాశయం (తాటిపూడి) వద్ద బుచ్చి అప్పారావు విగ్రహానికి స్థలాన్ని కేటాయిస్తామని ఇరిగేషన్ శాఖ ఈస్ట్‌కోస్ట్ చీఫ్ ఇంజినీర్ శంబంగి సుగుణాకర్ తెలిపారు. మండలంలోని తాటిపూడి రిజర్వాయర్‌కు స్వర్గీయ బుచ్చి అప్పారావు పేరును నామకరణం చేస్తూ ప్రభుత్వం గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. జలాశయం ప్రాంగణంలో బుచ్చి అప్పారావు విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొప్పల వెలమ సంక్షేమ సంఘం తరపున ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ నేపథ్యంలో చీఫ్ ఇంజినీర్ సోమవారం రిజర్వాయర్‌ను, సంఘం నాయకులతో కలిసి సందర్శించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం విగ్రహ స్థాపన కోసం మూడు చోట్ల కొలతలు తీశారు. కార్యక్రమంలో బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మినేని శ్రీనివాస్, రాష్ట్ర కొప్పల వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, జాతీయ కన్వీనర్ కొరుపోలు సత్యారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ పారిపిరెడ్డి అప్పలనాయుడు, శీర సత్యనారాయణ, డాక్టర్ బొత్స వరప్రసాద్, బొమ్మి నాయిని తిరుపతినాయుడు, గేదెల తిరుపతిరావు, తాటిపూడి సర్పంచ్ ఆదిరెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులకు శిక్షణ

నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్ల మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో నెల్లిమర్ల, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల వ్యవసాయ ల్యాబ్ అధికారులకు సోమవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకుడు హరికృష్ణ శిక్షణ తరగతులను ప్రారంభించారు. విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షా విధానాలపై అవగాహన కల్పించారు. విత్తన మొలక శాతం, తేమ శాతం లెక్కింపును ప్రయోగాత్మకంగా తెలియజేశారు. రైతుల మేలుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చిందని, నాణ్యత, పరీక్ష విధానంపై సంబంధిత సిబ్బంది అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆరు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అగ్రిటెస్టింగ్ ల్యాబ్ ఏఓలు శ్రీలక్ష్మి, లలిత, పద్మావతి, ప్రసాదరావు, సూరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

30 పంచాయతీల్లో 19న ఉప ఎన్నిక

- జిల్లాలో 30 వార్డు మెంబర్లు, రెండు సర్పంచ్ స్థానాలకు ఉప ఎన్నిక
- డీపీఓ బలివాడ సత్యనారాయణ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలోని 30 పంచాయతీల్లో ఈ నెల 19న ఉపఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 30 వార్డు మెంబర్లు, రెండు సర్పంచ్ స్థానాలకు ఉపఎన్నిక నిర్వహిస్తామన్నారు. ఈ నెల 8న నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న నామినేషన్ల పరిశీలన, 12న అభ్యంతరాల స్వీకరణ, 14న అభ్యర్థుల విత్‌డ్రా, తుది జాబితా విడుదల చేస్తామన్నారు. 19న ఉప ఎన్నిక నిర్వహించి అదే రోజున ఫలితాలు నిర్వహిస్తామని తెలిపారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో ఉప ఎన్నికల వివరాలు ఇలా...

సాలూరు మండలంలో పెదపదం-9, జిల్లాడు వలస-2, జీగిరాం-4, పురోహితుని వలస-2వ వార్డు

పాచిపెంట మండలంలో మెళియా కంచూరు-6, మాతుమూరు-5, పణుకువలస-7వ వార్డు

సీతానగరంలో జోగింపేట-1, 7, లచ్చయ్యపేట-6వ వార్డు

సీతంపేటలో కీరసజోడు-4, కొత్తగూడ-6, కండదండి-8, పూతికవలస-3, దుగ్గి-1, చినభగ్గ-7వ వార్డు

పాలకొండలో వీపీ రాజుపేట-1, 7, పణుకువలస-7వ వార్డు, సర్పంచ్), అన్నవరం-6వ వార్డు

వీరఘట్టంలో నీలానగరం-4వ వార్డు

గరుగుబిల్లి మండలంలోని పెదగుడబ-7వ వార్డు

కొమరాడ మండలంలో పరశురాంపురం-5, గుమడ-10వ వార్డు

జియ్యమ్మవలస మండలంలో కొండచిలకాం-4వ వార్డు

కురుపాం మండలంలోని గుమ్మ సర్పంచ్ స్థానానికి ఎన్నిక జరగనుంది.



క్లుప్తంగా

యోగా శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం


మాట్లాడుతున్న యోగా కోర్సు డైరెక్టర్లు

బొబ్బిలి: యోగా కోర్సుల్లో పీజీ, పీజీ డిప్లమో, పీహెచ్‌డీ కోర్సులకు ఆంధ్రా యూనివర్సిటీ ఆహ్వానం పలుకుతోందని పట్టణంలోని శ్రీయోగ విద్యాసంస్థ కోర్సు డైరెక్టర్లు ఎంఈవీ ప్రసాద్, కె.సత్య తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మా శ్రీ యోగా సంస్థలో ఆరు నెలల డిప్లొమో కోర్సులో శిక్షణ ఇచ్చేందుకు ఎంఓయూ కుదిరించదన్నారు. ఉమ్మడి జిల్లాలో ఆంధ్రాయూనివర్సిటీ అనుమతించిన ఏకైక యోగా విద్యా సంస్థ తమదేనన్నారు.ఆరు నెలల యోగా కోర్సు కోసం రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500 డీడీ తీసి చేరాలని సూచించారు. రూ.10వేల కోర్సు ఫీజుతో ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాల్సి ఉందన్నారు, మా సంస్థకు ఎటువంటి రుసుమూ చెల్లించనవసరం లేదని స్పష్టం చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలోని విజయనగరం ప్యాలస్ ద్వారా కోర్సుకు అప్‌లై చేసుకోవాలని, లేదా ఫోన్ 9988229011,7013969066 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

7తులాల బంగారం చోరీ

జామి: మండలంలోని భీమసింగి గ్రామంలో 7తులాల బంగారు అభరణాలు చోరికి గురయ్యాయి. గ్రామానికి చెందిన గురునాయుడు తన కుమార్తె వివాహం నిమిత్తం బంగారం హారం, తాడు, తదితర వస్తువులు కొని ఇంట్లో బీరువాలో భద్రపరిచాడు, ఆదివారం రాతిర ఉక్కపోత వల్ల కుటుంబసభ్యులు మేడపైన ఇంట్లో పడుకున్నారు. సోమవారం ఉదయం గురునాయుడు కుటుంబసభ్యులు కిందికి దిగి చూడగా ఇంటికి ఉన్న తాళం పగులగొట్టి తలుపులు తీసి ఉన్నాయి. దీంతో ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువా తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉండడంతో బంగారం చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు క్లూస్ టీం బృందం వచ్చి వేలిముద్రలు సేకరించింది. ఘటన స్థలానికి వచ్చిన సీసీఎస్ ఎస్సై బుచ్చిరాజు, ఎస్.కోట సీఐ బాల సూర్యారావు జరిగిన ఘటనపై ఆరా బాధితులను అడిగితెలుసుకున్నారు.

వసంత్ విల్లాలో చోరీ

విజయనగరం క్రైమ్: స్థానిక ధర్మపురి వసంత విహార్ విల్లాలో ఆదివారం చోరీ జరిగింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వసంత విహార్ విల్లా 49లో నివాసం ఉంటున్న వర్రి శ్రీనివాసరావు గంట్యాడ మండలం డీకే పర్తిలో సచివాలయ సంక్షేమం, విద్యాసహాయకుడిగా పనిచేస్తున్నాడు. ఆరోతేదీన ఆయన అత్తవారింటికి డెంకాడ వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం విరగ్గొట్టి, తలుపులు తెరిచి ఉండడం గమనించాడు. బెడ్‌రూం బీరువా, కప్‌బోర్డు తెరిచి వస్తువులన్నీ చిందరవందరగా ఉండడంతో బీరువాలో ఉన్న ఆరుతులాల బంగారు ఆభరణాలు, కిలో వెండి వస్తువులు , కొంతనగదు పోయినట్లు గుర్తించారు. సమాచారం మేరకు రూరల్ సీఐ తిరుపతిరావు, ఎస్సై గణేష్‌లు సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గణేష్ తెలిపారు.

గొంతుకోసి పరారైన అగంతుకుడు


గాయపడిన నాగరాజు

పార్వతీపురం: గుర్తు తెలియని వ్యక్తి గొంతుకోసి పరారవడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన పట్నాన నాగరాజు సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి నాగరాజు ముఖంపై ముసుగువేసి గొంతు కోసి పరారయ్యాడు. ఈఘటనలో నాగరాజు గొంతువద్ద బలమైన గాయం కావడంతో చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని సర్పంచ్ జె.ప్రవీణ్‌కుమార్ పోలీసులకు తెలియజేయగా రూరల్ ఎస్సై వై.సింహాచలం కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹ 190

ప్రతి అర్జీని పరిష్కరించాలి

● ఇన్‌చార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్


వినతులను స్వీకరిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అందే ప్రతి వినతిని క్షేత్రస్థాయిలో ఏ విధంగా పరిష్కరిస్తున్నారనే అంశంపై మండల ప్రత్యేకాధికారులు తప్పనిసరిగా సమీక్షించాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. వివిధ శాఖలకు అందుతున్న వినతులు, అర్జీదారులు సమస్యలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించే రీతిలో తగిన చర్యలు తీసుకుంటున్నదీ లేనిదీ పర్యవేక్షించాలని కోరారు. మండలాల్లో అధికారులతో సమావేశాలు నిర్వహించేటప్పుడు ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జగనన్నకు చెబుదాం వినతుల పరిష్కారంపై ఇన్‌చార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్ సోమవారం జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సమీక్షించారు. ఇటీవల ఉద్యోగుల వినతుల స్వీకారం కోసం నిర్వహించిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో పలు శాఖల ఉద్యోగుల నుంచి అందిన వ్యక్తిగత వినతుల పరిష్కారంపై కూడా తీసుకున్న చర్యలను తెలుసుకున్నారు. జగనన్నకు చెబుదాంలో భాగంగా పలు వర్గాల నుంచి 325 వినతులు అందాయి. జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఆర్‌డీఓ ఎం.వీ.సూర్యకళ, కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, డిప్యూటీ కలెక్టర్లు పద్మలత, సుధారాణి, లావణ్య వినతులు స్వీకరించారు.

ఎస్పీ స్పందనకు 45 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ ఎం.దీపిక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆమె నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి 45 ఫిర్యాదులు స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు వారితో మాట్లాడారు. అనంతరం ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, దిశా డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐలు కేకేవీ విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

సంతృప్తికర పరిష్కారం చూపాలి


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

● కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు సకాలంలో సంతృప్తికర పరిష్కారం చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జగన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు ఆర్.గోవిందరావు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, జిల్లారెవెన్యూ అధికారి జె.వెంకటరావులతో కలిసి ప్రజలనుంచి ఆయన వినతులు స్వీకరించారు. ప్రజాసమస్యలపై జిల్లా అధికారులు, మండల అధికారులతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీచేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు పలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 105 అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి. జగన్నాథ రావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్ర రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: స్పందన ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి వారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్, ఎస్బీ సీఐ సీహెచ్ లక్ష్మణరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ ప్రభాకర్, ఏఆర్ ఆర్‌ఐ శ్రీరాములు, డీసీఆర్‌బీ ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై లైంగిక వేధింపుల కేసు

● పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు


ఎస్సై లోకేశ్వరరావుతో మాట్లాడుతున్న ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ

వంగర: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినిని వేధిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు పాఠశాలలో పనిచేస్తున్న ఎస్ఎస్ ఉపాధ్యాయుడు బండి రాముడుపై వంగర పోలీసులు కేసు నమోదు చేశారు. తమ కుమార్తెతో ఉపాధ్యాయుడు అసభ్యకరంగా మాట్లాడుతూ లైంగికంగా వేధిస్తున్నాడంటూ బాలిక తల్లిదండ్రులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర ఆదేశాల మేరకు సంతకవిటి ఎస్సై బుడుమూరు లోకేశ్వరరావు వంగర చేరుకుని విచారణ చేపట్టారు. ప్రత్యేక తరగతుల పేరిట ముందస్తుగా పాఠశాలకు రావాలని చెప్పడం, అందరిలో బాలిక పట్ల వికృత చేష్టలు చేసిన ఫొటోలను సోషల్‌మీడియాలో పోస్టుచేసిన ఉపాధ్యాయుడు వాట్సాప్‌లో మెసేజ్‌లు చేసేవాడని బాధిత బాలిక తల్లిదండ్రులు విచారణలో తెలియజేశారు. ఈ మేరకు ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై లోకేశ్వరరావు తెలిపారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

ఎస్.ఎస్.ఉపాధ్యాయుడు బండి రాముడుపై సస్పెన్షన్ విధిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలు జారీ చేసినట్లు పాఠశాల హెచ్ఎం ముద్దాడ రమణమ్మ తెలిపారు.

ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలి

అభంశుభం తెలియని బాలికపై అసభ్యకరంగా వ్యవహరించి, లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ కోరారు. పాఠశాలలో జరిగిన విషయాన్ని తెలుసుకుని హుటాహుటిన ఆయన పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్సై లోకేశ్వరరావుతో మాట్లాడారు.

పల్సర్ బైక్ రమణ సినిమా షూటింగ్ సందడి


మాట్లాడుతున్న బేబీ-2.0 చిత్రయూనిట్

విజయనగరం టౌన్: పల్సర్ బైక్ రమణ సినిమా షూటింగ్ సందడి జిల్లా కేంద్రంలో సోమవారం నెలకొంది. రమణ నటిస్తున్న ఈ చిత్రానికి బేబీ 2.0 టైటిల్ ఖరారు చేశామని దర్శకుడు కుమారస్వామి తెలిపారు. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఇప్పుడున్న యూత్‌కు చిత్రం కనెక్ట్ అవుతుందని చిత్రయూనిట్ పేర్కొంది. హీరోయిన్ సోనీరెడ్డి, ప్రతినాయకుడిగా ప్రశాంత్ చిత్రంలో నటిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్‌గా హరీష్ కోరాడ, ఎడిటర్ ప్రసాద్, పాటలు, సంగీత దర్శకుడి జాన్ వ్యవహరిస్తున్నారు. షూటింగ్‌ను వీక్షించేందుకు స్థానికులు, ఔత్సాహికులు తరలివచ్చారు.

విజయనగరంలో రూ.46 కోట్లతో అమృత్ ప్రాజెక్టులు

విజయనగరం: పట్టణంలో రూ.46.96 కోట్లతో అమృత్ పథకం కింద రెండు నీటిసరఫరా ప్రాజెక్టులు, ఒక సెవేజ్, సెప్టేజ్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టుతో పాటు మూడు పార్కుల అభివృద్ధి చేపట్టామని, పనులు వివిధ దశల్లో ఉన్నాయని విజయసాయిరెడ్డి మరో ప్రశ్నకు మంత్రి కౌశల్ కిశోర్ జవాబిచ్చారు.

100లీటర్ల సారా పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా, స్కూటీ

వీరఘట్టం: సారా అమ్మకాలు, రవాణాపై పోలీసులు సోమవారం మండల వ్యాప్తంగా సోదాలు చేశారు. ఈ క్రమంలో చిదిమి గ్రామ సమీపంలోని మామిడి తోటలో ఉంచిన సారాను గుర్తించి నిందితుడు శ్రావణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎంవీ రమణ తెలిపారు. ఈ సోదాల్లో 100లీటర్ల సారాతోపాటు స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సాలూరులో 200 సారా ప్యాకెట్లు..

సాలూరు: పట్టణంలో ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 200 సారా ప్యాకెట్లు పట్టుకున్నామని ఎస్సై భాస్కరరావు తెలిపారు. బంగారమ్మ కాలనీ వద్ద సారా ప్యాకెట్లు తరలిస్తున్న వంతల సూరిబాబు, బంకా సింహాద్రిలను అదుపులోకి తీసుకుని బైక్ సీజ్ చేసినట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

విజయనగరం ఫూల్‌బాగ్: మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి. సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) విజయనగరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి పార్లు దండాలతో నిరసన వ్యక్తం చేశారు. దీంతో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్రావు, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు జగన్మోహన్‌రావు, సీఐటీయూ నగర కార్యదర్శి బి.రమణ, జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు మున్సిపల్ యూనియన్ నాయకులు టి.బాబురావు, ఎం దుర్గారావు, జలగడుగుల బాలరాజు, జలగడుగుల గణపతి, జలగడుగుల సీతారాం లను పోలీసులు అరెస్టు చేసి ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడిచిపెట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

లారీ, బైక్ ఢీ: ఒకరి మృతి


మృతిచెందిన రాములు

పార్వతీపురం: కొమరాడ మండలంలోని కూనేరులో బైక్‌ను లారీ ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో ద్విచక్రవాహన చోదకుడు మృతి చెందాడు. ఈ ఘటనపై సోమవారం పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం విక్రాంపురం గ్రామానికి చెందిన దండుపాటి రాములు(55) గ్రామం నుంచి కూనేరుకు చేపలు విక్రయించేందుకు ద్విచక్రవాహనంపై ఆదివారం వెళ్లాడు. చేపల విక్రయం అనంతరం స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తుండగా పార్వతీపురంనుంచి రాయగడ వస్తున్న లారీ, కూనేరు-రామభద్రపురం సమీపంలో ఢీకొంది. దీంతో రాములుకు తీవ్రగాయాలు కాగా వెంటనే చికిత్స కోసం పార్వతపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు కొమరాడ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

13 కేజీల గంజాయి స్వాధీనం


పట్టుబడిన గంజాయిని రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో తూకం వేస్తున్న ఎస్సై ఫక్రుద్దీన్


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఎల్ అప్పలనాయుడు

పాచిపెంట: ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తున్న 13 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఫకృద్దీన్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన బత్తిన చందు, తుమ్మ నాగరాజులు ఒడిశాలోని జైపూర్ నుంచి ఆర్టీసీ బస్సులో గంజాయిని సాలూరు వైపు తరలిస్తుండగా పి.కోనవలస చెక్ పోస్ట్ వద్ద పట్టుకున్నామన్నారు. ఆ నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో తూకం వేసి వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కైలా జంక్షన్ మరో 10కేజీలు..

గజపతినగరం: మెంటాడ మండలం కైలాం జంక్షన్ వద్ద 10 కేజీల గంజాయి తరలిస్తున్న ఒడిశా వాసిని పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన గజపతినగరం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒడిశాలోని కొరాపుట్ జిల్లా బంగి పుట్ గ్రామానికి చెందిన జయరామ్ గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పట్టుకుని గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆంధ్ర ఎస్సై సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

20కిలోల గంజాయి పట్టివేత

విజయనగరం క్రైమ్: స్థానిక లంకాపట్నం ఎఫ్‌సీ గోడౌన్ సమీపంలో సోము ఆదిబాబు 20 కిలోల గంజాయిని తీసుకువెళ్తుండగా టూటౌన్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనలో మరో నలుగురు వ్యక్తులు పరారీలో ఉన్నారని కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై షేక్ శంకర్ తెలిపారు.

హత్యకేసులో ముద్దాయికి జీవిత ఖైదు

విజయనగరం క్రైమ్: హత్యకేసులో నేరారోపణ రుజువు కావడంతో ముద్దాయికి జీవిత ఖైదు, రూ.పదివేలు జరిమానా విధిస్తూ విజయనగరం ఫోర్త్ ఏడీజే/ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి షేక్ సికిందర్ బాషా సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఆంధ్ర ఎస్సై సిద్ధార్థ కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు వివరాలపై ఆయన మాట్లాడుతూ ఆంధ్ర పోలీస్‌స్టేషన్ పరిధి మెంటాడ గ్రామానికి చెందిన కొల్లి కొండమ్మ భర్త సత్యనారాయణ, ఇల్లరికం వచ్చారన్నారు. ఇల్లరికం వచ్చిన అల్లుడు, కుమార్తెకు ఆస్తిలో వాటా ఇచ్చేందుకు కొండమ్మ తండ్రి సమ్మతించాడు. అయితే ఆయన తమ్ముళ్లు రాయిపల్లి అచ్చియ్య (ఎ1), సీతన్న (ఎ2), మరదలు గౌరమ్మ (ఎ3)ఆస్తిలో వాటా ఇచ్చేందుకు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆస్తి విషయమై కుటుంబసభ్యుల మధ్య తగాదా ఏర్పడడంతో 2018 జూన్ మూడో తేదీన రాత్రి తన భర్తను బంధువులు హత్యచేసినట్లు జూన్ 4న ఆంధ్ర పోలీస్‌స్టేషన్‌లో కొండమ్మ ఫిర్యాదుచేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నిందితుడు రాయిపల్లి అచ్చియ్య (ఎ1)పై నేరారోపణలు రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు వెల్లడించారని ఎస్సై తెలిపారు. ఎ2, ఎ3లపై నేరారోపణలు రుజువు కాకపోవడంతో వారిని నిర్దోషులుగా పరిగణించారని చెప్పారు. బాధితురాలి తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవీఎన్ జయలక్ష్మి వాదనలు వినిపించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

డెంకాడ: ఈ నెల 21,22వ తేదీల్లో నిర్వహించనున్న ఏపీ ఎన్‌జీఓల రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సంఘ నాయకులతో కలసి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సోమవారం ఆవిష్కరించారు. మోపాడలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మాట్లాడుతూ, విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మహా సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కొమ్మూరి దుర్గారావు, సంతోష్, జగదీష్, ఎ.సుధాకర్, పి.కృష్ణవేణి, లక్ష్మణరావు, సత్యనారాయణ, రమణ, భాస్కర్, అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఏపీ ఎన్‌జీఓ ప్రతినిధులు